నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఆజామాబాద్ ఐఈ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, మూసీకేఫ్ పరిధిలో 10.30 నుంచి 11, మదర్‌డైరీ పరిధిలో 11నుంచి 11.30, సంజీవయ్యనగర్, తిలక్‌నగర్ పరిధిలో 11.30 నుంచి మధ్యాహ్నం 1.30, సీతఈ కాలనీ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30, ఆర్‌పీఎమ్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2, చిక్కడపల్లి పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

నేడు, రేపు ఉచితంగా కంటి పరీక్షలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): డా. రామచంద్రన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బర్కత్‌పుర సర్కిల్‌లోగల హైదరాబాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో రెండురోజులపాటు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ డా. ఎ. వెంకటాచలం తెలిపారు. వివరాలకు 040-27567500, 040- 27564379 ఫోన్ నంబర్‌లలో సంప్రదించవచ్చన్నారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): సెవెన్‌హిల్స్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన గాన విభావరి అలరించింది. ఆమని, రమాదేవి, షాలిని రమేష్, ఆనందలక్ష్మి, రమేష్ రేపాల, సుభాష్, ఆర్. నాగరాజు, శ్రీధర్, ఉదయ్‌కుమార్, నందు, రవిచంద్ర తదితరులు గీతాలు ఆలపించారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి, లయన్ అరిగపూడి కృష్ణకుమారి విజయ్‌కుమార్, సాంస్కృతిక రంగప్రముఖులు గుత్తుల మీరాకుమార్, సంస్థ అధ్యక్షుడు వి. ఏడుకొండలు గాయనీగాయకులు అభినందించారు.

హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ పరిధిలో

25 నుంచి ఖోఖో, కబడ్డీ పోటీలు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ పరిధిలో ఈనెల 25 నుంచి ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఈవో కె. విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని నృపతుంగ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 28 వరకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 25, 26 తేదీలలో బాలికలకు, 27, 28 తేదీలలో బాలురకు కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఎంట్రీలు స్వీకరిస్తున్నామని, 23న డ్రా తీస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ ఐవోఎస్ సుమన్ నాయక్, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీఎక్స్ ఆస్పత్రిలో విద్యార్థికి అరుదైన శస్త్రచికిత్స

బర్కత్‌పుర, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలోని టీఎక్స్ ఆస్పత్రిలో విద్యార్థికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప జిల్లాకు చెందిన మల్లయ్య కుమారుడు మల్లేశం(26) ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కొంతకాలంగా మెదడులో ట్యూమర్ ఉండడంతో మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. కాచిగూడలోని టీఎక్స్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించగా.. పరీక్షలు చేసి మెదడులో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. న్యూరోసర్జన్ డాక్టర్ నరేష్‌కుమార్ బృందం అవేక్‌క్రానియోటమి చికిత్స ద్వారా ట్యూమర్‌ను తొలగించారు. ప్రస్తుతం విద్యార్థి కోలుకున్నాడని శుక్రవారం తెలిపారు. డాక్టర్ కీర్తికర్‌రెడ్డి, డాక్టర్ దీపక్‌రాజు, రవీంద్రరెడ్డి, చీఫ్ ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ వోడ్నాల పర్యవేక్షణలో శస్త్రచికిత్స చేశారని పేర్కొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ నిర్ణయాన్ని విరమించుకోండి

ముషీరాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎంఐఎం పార్టీ ముషీరాబాద్ ఇన్‌చార్జి షరీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్, గుల్షన్‌నగర్‌లలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ముస్లిం వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ముస్లిం వ్యతిరేక విధానాలకు స్వస్తిపలకాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు అజీజ్ ఉల్లా, ఉస్మాన్, లైక్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరానగర్‌లో ముస్లింలకు అవగాహన కల్పిస్తున్న ఎంఐఎం నాయకులు

ఆటోలో మరిచిపోయిన సూట్‌కేస్ ప్రయాణికుడికి అందజేత


మహ్మద్ అలీకి సూట్‌కేస్‌ను అందజేసిన పోలీసులు

రాంనగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన నగదు సూట్‌కేస్‌ను నల్లకుంట పోలీసులు ప్రయాణికుడికి అందజేశారు. చిత్తూరు జిల్లా, పలమనేరుకు చెందిన మహ్మద్ అలీ శుక్రవారం హిమాయత్‌నగర్ నుంచి నల్లకుంటకు ఆటోలో వెళ్లాడు. సూట్‌కేస్‌ను ఆటోలో మరిచిపోయిన అతడు నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అందులో రూ. 60 వేలు, బంగారు ఉంగరం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కేసు నమోదు చేసిన పోలీసులు మహ్మద్ అలీ ఎక్కిన ఆటోను గురించి సూట్‌కేస్ స్వాధీనం చేసుకుని అతడి అప్పగించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ జగదీశ్వర్ రావు తెలిపారు.




బీఆర్ఎస్ కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య, విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు ముఠా జైసింహ, నాగేష్ ముదిరాజ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

బీఆర్ఎస్ నాయకుల హౌస్ అరెస్ట్

రాంనగర్/చిక్కడపల్లి/గోల్నాక, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఇంటి ముట్టడికి ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి పిలుపు ఇవ్వడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నగర నాయకులను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. ముషీరాబాద్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హౌస్ అరెస్ట్ చేశారు. కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, దూసరి లావణ్య, విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ఎం. నగేష్ ముదిరాజ్, వి. సుధాకర్‌గుప్తా, దీన్‌దయాల్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్, రవియాదవ్, రాకేష్, ఎం. ప్రభాకర్, శ్యామ్‌యాదవ్ తదితరులను పోలీసులు ఇళ్ల నుంచి బయటకు రానీయలేదు.




నటనలోనే కాదు.. వ్యక్తిత్వంలోనూ సావిత్రి ఉన్నతులు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): సావిత్రి నటనలోనే కాదు వ్యక్తిత్వంలోనూ ఉన్నతమేనని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ 53వ వార్షికవేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో సహజనటనాభినేత్రి సావిత్రి సంపుటి ఆవిష్కరణ, సావిత్రి స్మారక వంశీ పురస్కారం రంగస్థల నటి సురభి ప్రభావతికి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాణీదేవి సంపుటిని ఆవిష్కరించి, ప్రభావతిని సత్కరించి మాట్లాడారు. సావిత్రి గొప్ప వితరణశీలి అని, ఇండో-చైనా యుద్ధ సమయంలో తన ఒంటిపై ఉన్న నగలు దేశ రక్షణ నిధికి ఇచ్చారని వివరించారు. సురభి ప్రభావతి చింతామణి, సత్యభామ వంటి పౌరాణిక పాత్రలతో పాటు సాంఘిక నాటకాలలో పలు పాత్రలు ధరించి మెప్పించారన్నారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ.. సావిత్రి తెలుగు ప్రేక్షకులకు నాటికి, నేటికీ ఆరాధ్య దేవత అని అన్నారు. సావిత్రి సంపుటిలో ఐదు ఖండాలలోని 9 దేశాలకు చెందిన 80 మంది రచయితల వ్యాసాలు రాశారని, ఇది తెలుగు వారికి ఆమెపై ఉన్న అభిమానానికి నిదర్శనమని వంశీ రామరాజు అన్నారు. తిరుమల గ్రూపు నంగునూరి చంద్రశేఖర్, వ్యక్తిత్వవికాస నిపుణుడు డా. బీవీ పట్టాభిరామ్, మాశర్మ, సావిత్రి సినిమాల్లో నటించిన మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు


సురభి ప్రభావతికి సావిత్రివంశీ పురస్కారాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

బీజేపీని సంస్థాగతంగా పటిష్ఠం చేయాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీని సంస్థాగతంగా పటిష్ఠం చేయాలని ఆ పార్టీ బెల్గామ్ దక్షిణ ఎమ్మెల్యే, రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి సి. కృష్ణాయాదవ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మహాకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు

సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

రాంనగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పేద ప్రజలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి, లౌకికవాదానికి తీరని లోటని, సమాజం గొప్ప మేధావిని కోల్పోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏచూరి సంతాప సభ జరిగింది. కార్యక్రమంలో రాంబాబుయాదవ్‌తోపాటు కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పి.నారాయణ, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి మారయ్య, కార్యదర్శులు మారుతి, వి.రామ్‌దేవ్‌యాదవ్ తదితరులు పాల్గొని సీతారాం ఏచూరికి నివాళులర్పించారు.

ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

గోల్నాక, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని అంబర్‌పేట జోన్ కన్వీనర్ ఎం. మహేందర్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం అంబర్‌పేట జోన్ కమిటీ నాయకులు జి.రాములు, సుబ్బారావు, షబానా, వరలక్ష్మి, యేసుదాసు, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్, అంబర్‌పేట జోన్ కన్వీనర్ ఎం.మహేందర్ తదితరులు


కోదండరెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

రైతు సంక్షేమం, వ్యవసాయరంగం అభివృద్ధికి కృషి

చిక్కడపల్లి/ముషీరాబాద్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమానికి, వ్యవసాయరంగం అభివృద్ధికి కృషి చేస్తానని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఆయనను కాంగ్రెస్ నాయకులు టి. భూపాల్, ముషీరాబాద్ బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ముదిరాజ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. అంజిరెడ్డి తదితరులు శుక్రవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పేదల ఇళ్లను తొలగించే ప్రతిపాదనను విరమించుకోవాలి

అంబర్‌పేట, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మూసీ అభివృద్ధి పేరుతో పరివాహక ప్రాంతాల్లో నివసించే పేదల ఇళ్లను తొలగించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం అంబర్‌పేట నియోజకవర్గం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గం కార్యదర్శి ఎం. మహేందర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేద ప్రజల్లో భయాందోళన కలిగిస్తోందని ఆరోపించారు. షాపింగ్ మాల్స్ పార్కులను నిర్మించడానికి పేదల ఇళ్లను ఖాళీ చేసే కుట్రను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇళ్లను కూల్చే ప్రతిపాదన విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నేతలు రాములు, షబానా, అఖిల్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు


బి. కృష్ణాయాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య

బీసీ జాగృతి సేన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడిగా

బూర్గుపల్లి కృష్ణాయాదవ్ నియామకం

రాంనగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ జాగృతి సేన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడిగా బూర్గుపల్లి కృష్ణాయాదవ్ నియమితులయ్యారు. శుక్రవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణాయాదవ్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలలో బీసీల సమస్యలపై పోరాడుతూ, బీసీ జాగృతి సేన బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

భారతీయుల ఐక్యతకు హిందీ భాష దోహదం

రాంనగర్, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమంలో భారతీయులందరినీ ఐక్యం చేసేందుకు హిందీ భాష ఎంతో దోహదపడిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్ట శేఖర్, ముదిగొండ భవానీ, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీధర్, కృష్ణకుమార్, కవిత పాల్గొని మాట్లాడారు. 1949 ఆగస్టు 14వ తేదీన హిందీ భాషను అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

తల్లి పేరిట మొక్క నాటండి

- ఇందిరాపార్కులో జీహెచ్‌ఎంసీ ప్లాంటేషన్

కవాడిగూడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): 'తల్లి పేరిట ఒక మొక్క నాటండి' కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టింది. స్వచ్ఛ వాయు జాతీయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ఇందిరాపార్కులో అదనపు కమిషనర్ ఎస్. పంకజ, చీఫ్ హార్టికల్చర్ అధికారి సునంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పంకజ మాట్లాడుతూ.. నగరంలో పచ్చదనం పెంచి పౌరులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వన మహోత్సవంలో భాగంగా నగరంలో 50 లక్షల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. సందర్శకులు ఎక్కువగా వచ్చే ఇందిరాపార్కు వద్ద క్యాంటిన్, వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించాలని వాకర్లు అదనపు కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ పంకజ


గాంధీనగర్‌లోని వినాయకమండపంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్


నల్లకుంట నర్సింహ బస్తీలో గణనాథుడికి పూజలు నిర్వహించిన కార్పొరేటర్ యాకర అమృత, సీఐ జగదీశ్వర్


కాచిగూడ వైశ్య హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో ఏర్పాటు చేసిన పార్వతీపుత్రుడికి కార్పొరేటర్లు, పలువురు ప్రముఖులు శుక్రవారం పూజలు నిర్వహించారు.


రిసాలగడ్డలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజలు చేసిన టీమ్ ఇండియా క్రికెట్ ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్, నిర్వాహకులు


నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోగల లక్ష్మీగణపతి దేవాలయంలో పూజలు నిర్వహించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు


బాగ్‌లింగంపల్లిలో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌యాదవ్